క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

ఎర్రగుంట్ల : చిలంకూరులోని ఎంబీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ రహంతుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలో అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి పూలంగళ్ల సర్కిల్‌లో ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. దేవదేవుడు రంగనాథస్వామికి ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం ప్రత్యేక వాహనంలో సూర్య ప్రభ, సాయంత్రం చంద్ర ప్రభ వా హనంపై సతీ సమేతుడైన శ్రీరంగనాథుడు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : శ్రీవేంకటరమణుడు ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీవేంకటరమణుడు పగలు హనుమద్వాహనం, రాత్రి గజ వాహనాలపై కొలువుతీరి భక్తులు దర్శనమిచ్చారు. సాయంత్రం గజవాహనంపై పురవీధులలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్తనామార్చాన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేంకటరమణుడి కల్యాణం ఆలయ అర్చకులు వరదాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

25న హాకీ జట్ల ఎంపికలు

పులివెందుల టౌన్ : ఈనెల 25వ తేదీన కడప నగరంలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూలులో జిల్లా సీనియర్ మహిళలు, సబ్ జూనియర్ మహిళల హాకీ జట్ల ఎంపికలు ఉంటాయని జిల్లా హాకీ సెక్రటరీ ఎం.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో జిల్లా సీనియర్ మహిళా క్రీడాకారులు మార్చి 8వ తేదీ నుంచి 10వ తేదీవరకు ప్రకాశం జిల్లాలో జరిగే సీనియర్ హాకీ పోటీలలో పాల్గొంటారని.. సబ్ జూనియర్ బాలికల హాకీ జట్టు టోర్నమెంటు వేదిక తేదీలు ఖరారు కాలేదన్నారు. ఈ ఎంపికలకు క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం తీసుకుని రావాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

జమ్మలమడుగు : హెచ్‌ఐవీ సోకిన వారు మందులు వాడుతూ మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ఎయిడ్స్, టీబీ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవీ సోకిన మహిళలు గర్భం దాల్చినప్పుడు పుట్టబోయే పిల్లలకు ఎయిడ్స్ వ్యాధి సోకకుండా జాగ్రత్తలను పాటించాలన్నారు. ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. ఎవరికైనా సమాచారం కావాలంటే 1097కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

లింగాల : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ తేజోష్ణ తెలిపారు. మండలంలో 528 డ్వాక్రా సంఘాలకు చెందిన 5061 మంది డ్వాక్రా మహిళలకు రూ.4,38,06,664ల మెగా చెక్కును ఎంపీ అందిస్తారన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి

పులివెందుల టౌన్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో గురువారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.భేగ్, అధ్యాపకులు, విద్యార్థులు ఉయ్యాలవాడ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. పట్టణంలో వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.రెడ్డిశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉయ్యాలవాడ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఉయ్యాలవాడ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు.

ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించవచ్చు

జమ్మలమడుగు : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువుకుంటే ఏమైనా సాధించవచ్చు అని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఏపీ గురుకు పాఠశాల, గూడెంచెరువులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, పెద్దపసుపుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఆయన పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం

వీరపునాయునిపల్లె : పంచాయతీ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ అధికారాలు వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవీంద్రారెడ్డిని గురువారం గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర ప్రజల శ్రేయస్సే జగనన్న ధ్యేయం


వీరపునాయునిపల్లెలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


మైలవరంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో ప్రజల శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రజలు వారి సమస్యలను మండల కేంద్రాలకు వెళ్లి పరిష్కరించుకునేవారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలు వారి గ్రామాల్లోనే ఏర్పాటు చేసిన సచివాలయాలలో వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల ద్వారా ప్రజల ముంగిటకే చేరుతున్నాయన్నారు. వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతి ఏడాది సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో వారిని సత్కరిస్తోందన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. వారు చేసిన కృషి వలన రాష్ట్రంలో మరణాల శాతం తగ్గిందన్నారు. దీనిపై భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. సిద్ధం సమావేశాలకు ప్రజలు చూపుతున్న ఆదరణను చూసి చంద్రబాబుకు గుండెల్లో వణుకు పుడుతోందన్నారు. కుప్పంలో ఓటమి ఖాయమని తెలుసుకున్న చంద్రబాబు ఎక్కడ నుంచి పోటీ చేయాలో తెలియక అయోమయంలో పడ్డాడన్నారు. అనతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డు పొందిన వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, స్థానిక ఎంపీటీసీ రాఘవ యాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డిలు పాల్గొని మాట్లాడారు. అనంతరం సేవ వజ్ర, సేవా రత్న, సేవా మిత్రా పురస్కారాలను వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో షకీలా బేగం, తాసిల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : జగనన్న ప్రభుత్వంలో నియమించిన వలంటీర్ల సేవలు అమోఘమని ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు ఉన్నందునే నేడు ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. నేడు


చక్రాయపేటలో సేవారత్నకు ఎంపికైన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

ఇంటి వద్దకే అవ్వాతాతలకు పింఛన్ తెల్లవారక ముందే చేరుతోందన్నారు. అనంతరం సేవారత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లు గాయత్రి, మోహన్‌రెడ్డి, శివకళ్యాణి, లక్ష్మీనారాయణరెడ్డి, మిత్రానంద్‌లను సన్మానించి వారికి ప్రసంశా పత్రంతో పాటు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హైదర్‌అలి, తహసీల్దారు బెన్నురాజ్, మండల ఉపాధ్యక్షులు గఫూర్, వేదమూర్తి, ఎంపీటీసీలు లీలావతి, మోహన్‌రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, సర్పంచులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మైలవరంలో...

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంజూరు చేసిన సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు సంక్షేమ సారథులని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మైలవరం మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొవిడ్ విపత్తు సమయంలో వలంటీర్లు రోగుల ఇంటికి వెళ్లి వారికి ఎప్పటికప్పుడు మందులు, పౌష్టికాహారం అందిస్తూ సేవలు అందించారన్నారు. అనంతరం వలంటీర్లను ఆయన ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీలు, కుమార్, రామసుబ్బారెడ్డి, బాలకొండయ్య, సర్పంచ్‌లు జగదీశ్వర్‌రెడ్డి, సోను బాయి, మండల కన్వీనర్ డి.మహేశ్వరరెడ్డి, రామాంజనే య యాదవ్, విష్ణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక మండల సభా భవనంలో గురువారం ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని మండలంలో 5 మంది వలంటీర్లకు సేవా రత్న, మిగిలిన వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను అందించి మాట్లాడారు. అనంతరం వలంటీర్లు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.ఎన్.భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్‌ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్ వలంటీర్లు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వాలంటీర్లకు మంచి భవిష్యత్తు వుందని, మెరుగైన సేవలందించిన వలంటీర్లను గుర్తించి ప్రభుత్వం వారికి పురష్కారాలు అందిస్తోందన్నారు. అనంతరం వలంటీర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పుష్పలత, ఇంద్రాణి, రేణుక, ఎంపీడీవో చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేలు జరిగి ఉంటేనే మరో అవకాశం కల్పించండి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధిపొంది ఉంటే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం మండలంలోని గండికోటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిలు ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండికోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.250 కోట్లతో ఒబెరాయ్ విల్లాల నిర్మాణం కోసం శంఖుస్థాపన చేయడం జరిగింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎర్పడితే గండికోట రూపురేఖలు మారిపోతాయన్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు వైఎస్సార్ నేతన్న నేస్తంతో పాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇస్తున్నారన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

కమలాపురం : గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెవరేర్చిన ఘనత జగనన్నదేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, జేసీఎస్ కన్వీనర్ ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వారు ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెవరేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో తప్పని సరిగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను తిరిగి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, చెన్నకేశవరెడ్డి, భాస్కర్, పెద్దచెప్పలి చిన్ని, శేఖర్, సుబ్బన్న, చంద్రపాల్, చంటి, మహ్మద్ గౌస్, విజయేంద్రారెడ్డి, సురేష్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దచెప్పలిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు గ్రామం ముద్దనూరు రోడ్డులో బ్యాంక్ ఎదురుగా ఉన్న భవనంలో నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి ప్రారంభించి కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన పరదేశి ఫ్యామిలీతో పాటు ఐదు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య , పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు రఘునందన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోండారెడ్డి, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, ముస్తాఫా, బహదూరు, ఎంపీటీసీ కొండయ్య, గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ డెవిడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యాలయంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ముగిసిన విగ్రహ ప్రతిష్ట వేడుకలు

సింహాద్రిపురం : స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజ కలశ, నవగ్రహ ప్రతిష్టాపన పూజలు గురువారం వైభవంగా ముగిశాయి. ఉదయం ప్రాణ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, హోమ కుండముల వద్ద దంపతులచే హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 'డియర్ ఉమా' సినిమా హీరోయిన్ సమయారెడ్డి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. 'డియర్ ఉమా' సినిమా ద్వారా తొలిసారిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతున్నానని.. ప్రేమ కథ బ్యాక్ డ్రాప్‌తో ఈ సినిమా ఉంటుందని ఈ సినిమా టీజర్ విడుదలైందన్నారు. మే నెలలో విడుద చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.1.7 లక్షల విరాళంగా ఆమె అందజేశారు.


శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న సినీ హీరోయిన్ సమయారెడ్డి

ప్రభువు దీవెనతో జిల్లా వాసులకు సుఖ శాంతులు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు ఆశీస్సులతో జిల్లా వాసులందరికీ సుఖ శాంతులు పుష్కలంగా లభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష ఆకాంక్షించారు. గురువారం స్థానిక సీఎస్‌ఐ చర్చిలో రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన బిషప్‌ను కలిసి శుభాకాంక్షలు అందజేసి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా అంజాద్‌బాష మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం జిల్లా వాసులు ఏసు ప్రభువును ప్రార్థించాలని కోరారు. నగర డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ జిల్లాతో పాటు రాష్ట్ర మంతటా సుభిక్షంగా ఉండాలని, ఎలాంటి అలజడి, అశాంతి లేకుండా ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లేలా ప్రభువు ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా బిషప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, జయ చంద్రారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మాస్టర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి

చెన్నూరు : మండలంలోని గోపవరం గ్రామం వద్ద నిర్మించిన శ్యామల మాతాంగిదేవి ఆలయంలో మాతాంగి దేవి విగ్రహ ప్రతిష్ట గురువారం పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు శ్రీ అభిన ఉద్దండ విద్యాశంకర భారతిస్వామి చేతులు మీదుగా వైభవంగా నిర్వహించారు. అనంతరం బండ లాగుడు పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజులురెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయం 36వ వార్షిక మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి వివిధ హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్యలు అమ్మవారిని దర్శించుకున్నారు

ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణ ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజ బలి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ రాజ్యలక్ష్మీదేవి అమ్మవారికి, చెన్నకేశవస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే మండలంలోని పెద్దలేబాక, బక్కిరెడ్డి పల్లె గ్రామాల సరిహద్దులో వెలసిన శ్రీ సిద్వేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శివపార్వతుల కల్యాణంను వేద పండితులు శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, వివిధ హోమాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

పులివెందుల రూరల్ : రహదారి భద్రతా నియమాలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 30 రోజులపాటు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పట్టణంలోని వివిధ కళాశాల విద్యార్థులకు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భద్రతా మాసోత్సవాలకు సహకరించిన వాహనదారులు, డ్రైవర్లు, రాజకీయ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు అధిక లోడుతో ప్రయాణం చేయవద్దన్నారు. వాహనదారులు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు, కార్లలో సీటు బెల్టు ధరించాలన్నారు.

ముద్దనూరు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నిక

కొండాపురం : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టర్ అసోసియేషన్ ముద్దనూరు సమితి ఎన్నికలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించినట్లు ఈఓపీఆర్ ఆర్‌డీ శశిధర్‌రెడ్డి తె లిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం ఎఓ ఎంపీపీగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసులరెడ్డిని అధ్యక్షుడిగా, మైలవరం టైపిస్ట్ ఎంపీపీగా ఉన్న శ్రీహరిని ఉపాధ్యాక్షుడిగా, ముద్దనూరు సీనియర్ అసిస్టెంట్ ఎంపీపీగా ఉన్న వరప్రసాద్‌రెడ్డిని జనరల్ సెక్రటరీగా, ముద్దనూరు అసిస్టెంట్ జిల్లా ఉన్నత పాఠశాల(బాయ్స్) వెంకటరెడ్డిని జాయింట్ సెక్రటరీగా, ట్రెజరర్లుగా ఏ. కృష్ణయ్య, జిల్లా కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, శివచంద్రలను ఎన్నికల అధికారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేసవి దృష్ట్యా తాగునీటిపై దృష్టి పెట్టాలి

చక్రాయపేట : వేసవికాలం వస్తుండటంతో గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా జగనన్న ప్రభుత్వంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఉంటుందని తెలిసి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇంకా ఎక్కడైనా ఇలాంటి సమస్య ఉంటే ఆయా ప్రాంతాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇదే సందర్భంలో ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా తగుచర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీహరికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గుండె, డెంగ్యూ, కొలెస్ట్రాల్, కామెర్లు, షుగర్ బీపీ వంటి పరీక్షలు చేసే మిషనరీని అందుబాటులోకి తెచ్చిందన్నారు. మండల సమావేశానికి పలు శాఖలకు చెందిన అధికారులు డుమ్మా కొట్టడంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారు బెన్నురాజ్, ఎంపీడీవో హైదర్ అలీ, మండల ఉపాధ్యక్షులు వేదమూర్తి, అబ్దుల్‌గఫూర్, వైద్యాధికారులు శ్రీవాణి, శివప్రసాద్, ఎంపీటీసీలు లీలావతి, మోహన్‌రెడ్డి, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, హరిశేఖర్ నాయుడు తదిరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి

వైభవంగా ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలోని కాటారెడ్డి కాలువ వద్ద వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన, లక్ష్మినరసింహస్వామి 20వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మినరసింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీకెదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులరెడ్డి ప్రారంభించారు. పోటీలల్లో గెలుపొందిన ఎద్దులకు బహుమతులు అందజేశారు. అలాగే పెండ్లిమర్రిలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


పోటీలను ప్రారంభిస్తున్న నరేన్ రామంజులరెడ్డి